# నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తా..
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి
- రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి పథకాలు ప్రారంభం

పాలకుర్తి రూరల్, డిసెంబర్ 10 : గడిచిన 15ఏళ్లలో జరగని అభివృద్ధిని ఐదేళ్లలో చేసి పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఆమె ఆదివారం ప్రారంభించారు. అలాగే రాజీవ్ చౌరస్తాలో మహిళలకు ఉచిత బస్ సౌకర్యం మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. తొలుత శ్రీ సోమేశ్వరలక్ష్మినర్సింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే దంపతులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేయడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన ఆరు హామీల్లో రెండు హామీలను సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా అమలు చేశామన్నారు. మరో నాలుగు హామీలను త్వరలోనే అమలు చేస్తామన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని చెన్నూరు, పాలకుర్తి రిజర్వాయర్లను పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వ దవాఖానను వంద పడకలుగా మారుస్తానన్నారు. జూనియర్, డిగ్రీ కళాశాలలను మండల కేంద్రంలో మంజూరు చేస్తామన్నారు. తొర్రూరులో వంద పడకల దవాఖానను మంజూరు చేస్తామన్నారు. తొర్రూరు చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మారుస్తామన్నారు. పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు తన మీద నమ్మకంతో అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. తన గెలుపునకు కృషి చేసి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలే కాకుండా మేము నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేకంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా నియోనజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వీ సుహాణి, జిల్లా వైద్యాధికారి ప్రశాంత్, రాష్ట్ర నాయకులు లకావత్ లక్ష్మీనారాయణనాయక్, ఎన్ ప్రవీణ్‌రావు, జాటోత్ నెహ్రూ, కాకిరాల హరిప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, బైరు భార్గవ్, ఎంపీటీసీ కమ్మగాని పుష్పలీలానాగయ్య, అడ్దూరి రవీందర్‌రావు, ఎర్రబెల్లి రాఘవరావు, జలగం కుమార్, సురేశ్‌నాయక్, గంగు కృష్ణమూర్తి, పోగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

## ప్రశాంతంగా ముగిసిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష

జనగామ రూరల్, డిసెంబర్ 10 : ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులు చదువును కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం ఏటా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) ఎంపిక పరీక్ష నిర్వహిస్తుందని డీఈవో రాము తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాఠశాలలో ఈ పరీక్ష నిర్వహించినట్లు ఆయన తెలిపారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి 5ఏళ్లపాటు ఉపకార వేతనం అందిస్తూ ప్రోత్సహిస్తోందని తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 593మంది విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా ఆదివారం నాలుగు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించినట్లు ఆయన తెలిపారు. 582మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాయగా 11మంది గైర్హాజరైనట్లు ఆయన చెప్పారు. ఈ పరీక్ష ద్వారా ఎంపికైన ప్రతిభావంతులకు ఇంటర్ పూర్తయ్యే వరకు ఉపకార వేతనం అందిస్తారని డీఈవో రాము తెలిపారు.


వధువుకు ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ వెంకట్‌గౌడ్

## పేదింటి పెళ్లికి సర్పంచ్ ఆర్థిక సాయం

బచ్చన్నపేట, డిసెంబర్ 10 : మండలంలోని కొన్నె గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కురాం బాలయ్య మాధవిల కుమార్తె దివ్య వివాహం ఆదివారం జరిగింది. సర్పంచ్ వేముల వెంకట్‌గౌడ్ దివ్య పెళ్లికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం తనవంతుగా రూ,10వేలు అందించారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత కోడూరి శివకుమార్ సైతం దివ్యకు రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో తాటికొండ నర్సింహాచారి, పిట్టల బాలరాజు, తేలు శ్రీనివాస్, పిట్టల శివకుమార్, కురాం కనుకయ్య, పసుల సురేశ్, పసుల రవి, చెక్క కరుణాకర్, ప్రశాంత్, యాట బాలు, రమేశ్ పాల్గొన్నారు.


మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న శివకుమార్

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

బచ్చన్నపేట, డిసెంబర్ 10 : మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన మల్గ మల్లమ్మ ఆదివారం మృతి చెందింది. ఆ కుటుంబాన్ని గ్రామ బీఆర్ఎస్ నాయకుడు కోడూరి శివకుమార్ కలిసి పరామర్శించారు. అనంతరం తనవంతుగా అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కుర్మ సంఘం నాయకులు కర్రె నర్సమ్మ, సిద్ధిరాములు, ఐలయ్య, బింగి భరత్, రాకేశ్, విజయేందర్, మధు, కనుకయ్య, బాలరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు ఆపరేషన్ సక్సెస్‌పై పూజలు

జనగామ రూరల్, డిసెంబర్ 10 : ఎర్రవల్లిలోని తన స్వగృహంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఇటీవల ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి గాయపడిన విషయం విదితమే. కాగా, హైదరాబాద్‌లోని సోమాజీగూడ యశోద ఆసుపత్రిలో శనివారం చేసిన కీలు మార్పిడి ఆపరేషన్ సక్సెస్ అయినట్లు వైద్యులు తెలిపారు. ఆపరేషన్ సక్సెస్ కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ జనగామ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు చినబోయిన రేఖ, లింగాలఘనపురం మండలంలోని జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ తొందరగా కోలుకొని ప్రజల్లోకి తిరిగి రావాలని స్వామి వారిని వేడుకున్నామన్నారు. ఎంబరి పావని, స్వప్న, ఎదు గౌతమి పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న బీఆర్ఎస్ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు రేఖ

## అ‘పూర్వ’ సమ్మేళనం

దేవరుప్పుల, డిసెంబర్ 10 : మండల కేంద్రంలోని దేవరుప్పుల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2000–2001లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు భార్గవి గార్డెన్స్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. వారంతా ఒక్కచోట చేరి ఒకరినొకరు ఆత్మీయంగా పలుకురించుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. అన్ని బంధాలకంటే స్నేహబంధం గొప్పదని వారు అభిప్రాయం వెల్లడించారు. చిన్ననాటి మిత్రులంతా ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. అనంతరం తమకు విద్యాబుద్ధులు అందించిన ఆనాటి గురువులు దామోదర్‌రెడ్డి, రమేశ్‌శర్మ, చంద్రారెడ్డి, యాదవరెడ్డి, నబీసాబ్, మల్లికార్జున్, యాదగిరి, నర్సింహాచారి, రామస్వామి, శరబంధం, సోమారెడ్డిలను ఘనంగా సన్మానించి పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీపాల్, ప్రశాంత్, అజయ్, రవీందర్‌రెడ్డి, ఎల్లేశ్, సుమన్, యాకూబ్, నర్సింహా, రమేశ్, యాకన్న, మధు, పరశురాములు, శ్రీకాంత్, జాంభాసాయి, కుమార్, సుధాకర్, నీలికాంత్, వెంకట్‌రెడ్డి, యాకస్వామి, ఉప్పలయ్య, రాజు, నరేశ్, బాలరాజు, మల్లేశ్, శంకర్, యాదగిరి, కిషన్, ఉదయ్, రవిలాల్, భద్రు, రవి, మహేందర్, సంధ్య, రజిని, వరలక్ష్మి, సైదమ్మ, అన్నపూర్ణ, శ్రీలత, సరిత, రజిత, అనంతలక్ష్మి, ప్రేమలత, సునీత పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

# పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తాం

- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి
- బచ్చన్నపేటలో రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ప్రారంభం

బచ్చన్నపేట, డిసెంబర్ 10 : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతోపాటు అన్ని వర్గాల పేదలకు కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతామని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10లక్షలకు పెంచగా ఆదివారం పథకాన్ని ఆయన స్థానిక సీహెచ్‌సీలో ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, జనగామ ఆర్డీవో మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటీ నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రూ.5లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పథకాన్ని నేడు సీఎం రేవంత్‌రెడ్డి దాన్ని రూ.10లక్షలకు పెంచారన్నారు. దీంతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. అనంతరం మహాలక్ష్మి పథకాన్ని వారు ప్రారంభించారు. బస్సులో ఎక్కి నక్కవానిగూడెం నుంచి బచ్చన్నపేట వరకు ప్రయాణించారు. కార్యక్రమంలో బచ్చన్నపేట ఎంపీటీసీలు నల్లగొని పుష్పాబాలకిషన్ గౌడ్, అల్వాల రాధాఎల్లయ్య, ఎండీ. మసూద్, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు బల్లెపు వేణువందన, డాక్టర్ పీ సుగుణాకర్‌రాజు, శ్రీనివాస్, సిద్ధార్థరెడ్డి, తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీవో రఘురామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు బాలకిషన్‌గౌడ్, నిడిగొండ శ్రీనివాస్, దిడ్డిగ రమేశ్, నరేశ్, బాలమణి, మహాత్మాచారి, రాము, భాస్కరాచారి, ఎల్లయ్య, కరుణాకర్, రమేశ్, యూసూఫ్, శ్రీనివాస్, శివరాజ్‌యాదవ్, గౌస్, సత్యానారాయణ, రాజయ్య, నర్సింగరావు, కిష్టయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


‘రాజీవ్‌ఆరోగ్యశ్రీ’ని ప్రారంభిస్తున్న ఎంపీపీ నాగజ్యోతి, కొమ్మూరి ప్రతాపరెడ్డి

## ఎమ్మెల్యే యశస్వినీరెడ్డికి ఘన స్వాగతం

దేవరుప్పుల, డిసెంబర్ 10 : పాలకుర్తి ఎమ్మెల్యేగా ప్రప్రథమంగా పాలకుర్తి నియోజకవర్గాన్ని కోలుకొండలో తాకిన మామిడాల యశస్వినీరెడ్డికి కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే యశస్వినితోపాటు కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి ఆదివారం నియోజకవర్గానికి రాగా ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు వారికి ఘనసన్మానం చేశారు. అనంతరం ర్యాలీగా పురవీధుల గుండా పాలకుర్తికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్, కోలుకొండ ఎంపీటీసీ దామెర రమ, కోలుకొండ గ్రామశాఖ అధ్యక్షుడు దామెర పెద్దులు, దామెర అనిల్ తదితరులు ఉన్నారు.


కోలుకొండలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి